సాక్షి ములుగు

సోమవారం । 1 । మే । 2023



ఆవుమాంసం రవాణా చేస్తూ..

ఆవును కోసి దుప్పి మాంసం అని చెప్పి విక్ర యిస్తున్న ముఠాను అటవీశాఖ అధికారులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

- 8లో▸



బ్రహ్మోత్సవాలకు వేళాయె..

రెండో యాదగిరిగుట్టగా ప్రసిద్ధి చెందిన మల్లూరులోని హేమాచల లక్ష్మీనరసింహస్వా మి క్షేత్రం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
32^0 /22^0

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉం టుంది. ఆకాశం మేఘావృతమై పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



ఏటూరునాగారం: అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. మండల కేంద్రంలోని అకాల వర్షాల వల్ల నేల వాలిన పంటలను మండల నాయకులు ఆదివారం సందర్శించి రైతుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. యాసంగిలో సాగు చేసిన పంటలు దాదాపుగా అకాల వర్షానికి పూర్తిస్థాయిలో నాశనమయ్యాయని వాపోయారు. నష్టపోయిన పంటలను సర్వేచేసి రైతులకు పరిహారం వచ్చే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నర్సింహారావు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్న ఎల్లయ్య, ఎంపీటీసీ గుడ్ల శ్రీలత దేవేందర్, టౌన్ అధ్యక్షులు ఎండీ సులేమాన్, వర్కింగ్ టౌన్ అధ్యక్షులు సరికొప్పుల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

గీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి



ఎస్ఎస్‌తాడ్వాయి: ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి పడిన గీతకార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన రవి, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మళ్ల సమ్మయ్యలు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఎల్బాక గ్రామానికి చెందిన గీత కార్మికుడు మొక్క రాజు వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కుతుండగా పైనుంచి ప్రమాదవశాత్తు జారీ కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని కల్లుగీత కార్మిక సంఘం నాయకులు పరామర్శించి గౌడ సభ్యుల ద్వారా సేకరించిన రూ.15వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాజుకు తక్షణ సాయం కోసం టాడి కార్పొరేషన్‌కు దరఖాస్తు చేశామన్నారు. ప్రమాదాల నివారణకు గీత కార్మికులకు సేఫ్టీ మోకులు అందించాలని కోరారు. షెడ్యూల్, నాన్ షెడ్యూల్ తేడా లేకుండా ప్రమాదాల భారిన పడిన వారికి ఎక్స్‌గ్రేషియా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు గుండెబోయిన శ్రీహరి, బెల్లం కొండరాజు, నాయకులు మడ్డి నర్సయ్య, గట్టురాజు, బుర్ర భాస్కర్, వొగల బోయిన సహోదర్, నరేష్, మొక్క దుర్గయ్య, ఎరుకల శ్రీనివాస్‌శంకర్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల హర్షం

భూపాలపల్లి అర్బన్: ముఖ్యమంత్రి కేసీఆర్ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడం పట్ల జిల్లాలోని హర్షం వ్యక్తంచేస్తున్నట్లు కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బొజ్జం అనిల్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 20ఏళ్లుగా వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను ప్రభుత్వం రెగ్యులర్ చేయడం సంతోషకరమైన విషయమన్నారు.

రోడ్లపై చెట్ల తొలగింపు



టేకుమట్ల(రేగొండ): ఆదివారం రాత్రి ఈదురు గాలులతో కురిసిన అకాల వర్షాలకు రేపాక లోని రేగొండ–చిట్యాల ప్రధాన రోడ్డులో చెట్లు విరిగి రోడ్డుపై పడిపోయాయి. స్థానికులు సమాచారంతో రేగొండ ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో డోజర్ సహాయంతో చెట్లను తొలగించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. రాత్రివేళ రోడ్డుపై పడిపోయిన చెట్లను తొలగించిన పోలీసులకు గ్రామస్తులు, వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు. చెట్ల తొలగింపు కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్‌రావు, కానిస్టేబుల్ మాట్ల రాజయ్య ఉన్నారు.

వాగ్దేవి కళాశాల సెంటర్ వద్ద పరీక్ష రాయడానికి వచ్చిన అభ్యర్థులు



చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ సెంటర్‌లో..



వాగ్దేవి కళాశాల సెంటర్ వద్ద..



ఎల్బీ కళాశాల సెంటర్‌లో థర్డ్‌జెండర్లు..



ప్రశాంతంగా 'పోలీస్' పరీక్ష

కానిస్టేబుళ్ల తుది రాతపరీక్షకు 11,910 మంది అభ్యర్థుల హాజరు

పోలీస్ కానిస్టేబుళ్ల తుది రాత పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. స్టయిఫండరీ ట్రెయినీ కానిస్టేబుళ్ల నియామకంలో భాగంగా అభ్యర్థుల పరీక్ష కోసం వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో 16 సెంటర్లు ఏర్పాటు చేశారు. మొత్తం 12,029 మంది అభ్యర్థులకు హాల్ టికెట్లు జారీ చేయగా 11,910 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇందులో ముగ్గురు థర్డ్ జెండర్లు ఉన్నారు. ఉదయం 10 నుంచి ఒంటిగంట వరకు జరిగిన ఈ పరీక్ష కోసం అభ్యర్థులు ఉదయం 8 గంటల వరకే కేంద్రాలకు చేరుకున్నారు. పోలీస్ అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది.. తనిఖీలు నిర్వహించి లోనికి అనుమతించారు. పరీక్ష ప్రశాంతంగా ముగియడానికి కృషిచేసిన పోలీస్ సిబ్బందిని సీపీ రంగనాథ్ అభినందించారు. - కాజీపేట

సమ్మర్ క్యాంప్

డ్రాయింగ్ నేర్పుతున్న ట్రైనర్ స్వప్న



గురుకుల విద్యార్థులకు స్పార్కిల్స్ పేరుతో పలు రంగాల్లో శిక్షణ

- 15రోజుల ట్రెనింగ్‌లో భోజనం, వసతి ఉచితం
- జిల్లాలో రెండు సెంటర్ల ఏర్పాటు.. 400మందికి ట్రెనింగ్



డ్యాన్స్ నేర్చుకుంటున్న విద్యార్థులు

ఏటూరునాగారం: పుస్తకాలతో కుస్తీ పడుతూ నిత్యం చదువుల పురుగులవలే మెదులుతున్న విద్యార్థులకు ఆహ్లాదం, ప్రశాంతతను పంచాలనే ఉద్దేశంతో గురుకుల సొసైటీ అధికారులు విద్యార్థులు నైపుణ్యమైన శిక్షణ ఇస్తున్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో స్పార్కిల్స్ పేరుతో సమ్మర్ క్యాంప్ ఏర్పాటు చేసి 15రోజుల పాటు 5 రంగాల్లో శిక్షణ ఇస్తూ భోజనం, వసతి, అడవిలోకి ఫీల్డ్ విజిట్ వంటివి కల్పిస్తున్నారు.

6నుంచి 10వ తరగతి విద్యార్థులకు..

జిల్లాలోని ములుగు, ఏటూరునాగారం గురుకుల పాఠశాలల్లో స్పార్కిల్స్ సమ్మర్ క్యాంప్ శిక్షణ తరగతులను ఏప్రిల్ 22న ప్రారంభించగా ఈ నెల 6వ తేదీ వరకు సాగనుంది. ఒక్కో సెంటర్‌లో 200ల మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గురుకులాలకు చెందిన 6 నుంచి 10వ తరగతి గిరిజన బాలుర విద్యార్థులను ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నారు. వేసవి శిబిరంలో జీవన నైపుణ్యాలు, కమ్యూనికేషన్, నాయకత్వ సృజనాత్మక, సహకార నైపుణ్యాలు, డ్యాన్స్, డ్రాయింగ్, కంప్యూటర్ కోడింగ్, డీ కోడింగ్, లైఫ్ స్కిల్స్‌ను హైదరాబాద్‌కు చెందిన నిష్ణాతులైన ట్రైనర్స్‌తో విద్యార్థులకు శిక్షణ ఇప్పిస్తున్నారు. శిక్షణ తరగతులను ఐటీడీఏ పీఓ అంకిత్, ఆర్‌సీఓ రాజ్యలక్ష్మి, ఓఎస్‌డీ శ్రీనివాస్‌లు పరిశీలించి లోటుపాటులను సరిదిద్దారు. అలాగే డ్రాయింగ్ ట్రైనర్ స్వప్న, లైఫ్ స్కిల్ ట్రైనర్ మనోహర్, కంప్యూటర్‌లో ట్రైనర్ వంశీ ట్రెనింగ్ ఇస్తున్నారు.

ఆహ్లాదకరమైన వాతావరణంలో..

ఉదయం లేవగానే వాకింగ్, వ్యాయామం చేయిస్తూ వారి మెదడుకు సానపెడుతున్నారు. తరగతి గదుల్లో సైతం షెడ్యూల్ ప్రకారం బోధిస్తున్నారు. దీనివల్ల మానసిక ఒత్తిడితో ఉన్న విద్యార్థులు డ్యాన్స్, డ్రాయింగ్, లైఫ్ స్కిల్స్, కంప్యూటర్ పరిజ్ఞానం ట్రెనింగ్ వల్ల ఉపశమనం పొందుతున్నారు. చదవడమే కాకుండా సమాజంలో ఎదగడానికి ఉపయోగపడే సృజనాత్మకమైన విషయాలను తెలుసుకుంటున్నారు. సమ్మర్‌లో టీవీలకు, సెల్‌ఫోన్లకు ఆకర్షితులు కాకుండా ఉండేందుకు ఇలాంటి స్పార్కిల్స్ అన్ని మండలాల్లో ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



డ్యాన్స్ నేర్పుతున్న ట్రైనర్



ఉదయం వ్యాయామం చేస్తూ..



లైఫ్ స్కిల్స్ నేర్పుతున్న మనోహర్

ఆనందంగా ఉంది..



క్లాస్‌రూంలో చదువు అంటూ బిజీగా ఉండే తమకు డ్యాన్స్ నేర్పించడం ఆనందంగా ఉంది. చదువే కాకుండా ఇలాంటివి కూడా అవసరమని అర్థమవుతోంది. చదువుకోవడానికి మానసికోల్లాసం, మనోధైర్యం, జ్ఞాపక శక్తి ఎంతో అవసరం. అవి పెంపొందాలంటే ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలి.

– శశికిరణ్, ఈఎంఆర్ స్కూల్, 8 తరగతి, బయ్యారం

బొమ్మలు గీయడం ఆసక్తిగా ఉంది..



బొమ్మలను గీయడం ఎంతో ఆసక్తిగా ఉంది. ట్రైనర్స్ మెలకువలను నేర్పిస్తూ బొమ్మలను ఎలా గీయాలనేది చూపిస్తున్నారు. దీనివల్ల మాకు అన్ని రకాల బొమ్మలు గీయడం వస్తుంది. బొమ్మలు గీయడంతో పాటు రంగులు వేస్తుండడంతో ఆర్టిస్ట్ లాగా అనిపిస్తుంది.

– లావావత్ రాకేష్, 9వ తరగతి విద్యార్థి, జాకారం గురుకులం

సమాజంపై అవగాహన కల్పిస్తున్నాం..



చదువుతో పాటు విద్యార్థుల్లో సృజనాత్మకత పెరిగేలా పలు రంగాల్లో అవగాహన కల్పిస్తున్నాం. గురుకుల సొసైటీ, ఐటీడీఏ ద్వారా విద్యార్థులకు కావాల్సిన ఏర్పాట్లు చేశాం. ట్రెనింగ్ ఇవ్వడంతో పాటు వ్యాయామం, భోజనం అందజేస్తున్నాం. పిల్లలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాం.

– తుమికి వెంకటేశ్వరరాజు, క్రీడా పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఏటూరునాగారం

పార్టీ బలోపేతానికి కార్యకర్తలు పాటుపడాలి

ములుగు రూరల్: పార్టీ బలోపేతానికి బీజేపీ కార్యకర్తలు పాటుపడాలని జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 100వ మన్ కీ బాత్ కార్యక్రమం 110 నియోజకవర్గాల్లోని బూత్‌లలో ప్రత్యక్ష ప్రసారం నిర్వహించగా టపాకాయలు పేల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమయ్యే కార్యక్రమమే మన్ కీ బాత్ అన్నారు. కరోనా సమయంలో ప్రధాని మన్ కీ బాత్ ద్వారా ఎన్నో సూచనలు చేశారని తెలిపారు. ప్రధానమంత్రి మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు అజ్మీర కృష్ణవేణి, నియోజకవర్గ కన్వీనర్ సిరికొండ బలరాం, పోరిక ఉత్తమ్‌కుమార్, నగరపు రమేష్, వాసుదేవరెడ్డి, కృష్ణాకర్, మండల అధ్యక్షుడు ఇమ్మడి రాకేష్ యాదవ్, రాకేష్‌రెడ్డి, ప్రమోద్‌రెడ్డి, కుమార్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మన్ కీ బాత్ కార్యక్రమాన్ని చూస్తున్న బీజేపీ నాయకులు

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు



పూజలు చేస్తున్న విశ్వబ్రాహ్మణులు



అన్నదాన కార్యక్రమానికి హాజరైన భక్తులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలను ఆదివారం విశ్వబ్రాహ్మణులు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో వీర బ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి నైవేద్యాలను సమర్పించారు. అనంతరం హనుమాన్ భక్తులకు, ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి ఊరేగింపు కార్యక్రమాన్ని చేపట్టగా స్వామి రథానికి నీళ్లను ఆరబోసి స్వాగతం పలికి కొబ్బరికాయలను కొట్టారు. ఈ కార్యక్రమంలో మంతెన శంకర్, బాలోజు రమేష్, కందుకూరి సుధాకర్, గాదె శంకర్, గాదె నరేష్, మంతెన బ్రహ్మం, మంతెన రమేష్, లక్ష్మణచారి, వేణు, తదితరులు పాల్గొన్నారు.

పోరాడేది కమ్యూనిస్టులే

భూపాలపల్లి అర్బన్: భూమికోసం, భుక్తి కోసం పేద ప్రజల సంక్షేమం కోసం పోరాడేది కమ్యూనిస్టులే అని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని సింగరేణి ఫంక్షన్‌హాల్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ భూపాలపల్లి పట్టణంలో పాత ఎర్ర చెరువులో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని ఇంటి నిర్మాణాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలు, కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు ఇచ్చేంతవరకు సమరశీల పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. తమ డిమాండ్లు అమలుచేసిన తర్వాత ఓట్లు అడగాలని రాజకీయ పార్టీలను నిలదీయాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అన్ని పార్టీలూ ప్రజలను దోపిడీ చేసేవేనని చెప్పారు. ముందుగా సీపీఎం నాయకులు కంపేటి రాజయ్య పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జె.వెంకటేష్, నాయకులు చెన్నూరు రమేష్, రాజయ్య, గుర్రం రవీందర్, శ్రీకాంత్, మల్లయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

తప్పుదోవ పట్టిస్తున్న జేఏసీ నాయకులు


మంగపేట: బిల్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణ చేస్తామని చెప్పిన జేఏసీ నేతలు ఎలాంటి కార్యాచరణ చేపట్టకుండానే కాలయాపన చేస్తూ కార్మికులను తప్పుదోవ పట్టిస్తూ మోసం చేయడానికి చూస్తున్నారని ఏపీఆర్ ఆదర్శ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ కె. వెంకటాచారి ఆరోపించారు. మండల పరిధిలోని కమలాపురంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రోజుల క్రితం జేఏసీ నాయకులను నిలదీస్తే అప్పటికప్పుడు లెటర్ మార్పుచేసి పీఎఫ్ రూ.16.59 కోట్లు పెండింగ్‌లో ఉందని, గ్రాట్యూటీ అమౌంట్ రూ.15.52 కోట్లు చూపించారని ఆరోపించారు. ఈ విషయంపై కార్మికులు గొడవ చేస్తే జీతాలు, బోనస్, లీవ్ ఎన్‌క్యాష్ మెంట్ రిమైనింగ్ సర్వీస్‌పుల్, ఫైనల్ సెటిల్ మెంట్ చేయాలని లెటర్‌లో చూపించారన్నారు. జీతాలు ఎంత అమౌంట్ రావాలనే విషయంపై క్లారిటీ లేదన్నారు. ఈ విషయంపై ఆర్‌పీకే జేఏసీ నాయకుల మధ్య ఏదో ఒక్క ఒప్పందం కుదుర్చుకుని కార్మికులను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. కార్మికులకు ఎలాంటి అన్యాయం జరిగినా ఊరుకునేది లేదన్నారు. ఇప్పటికైనా జేఏసీ నాయకులు కార్మికులకు న్యాయం జరిగే విధంగా పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీఆర్ ఆదర్శ వర్కర్స్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ విజయరావు, జాయింట్ సెక్రటరీ పల్లి భాస్కర్ రావు, కోశాధికారి నర్సయ్య, సీనియర్ కార్మికుడు యాదగిరి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటాచారి

వన్యప్రాణుల వేట

- రెండేళ్ల క్రితం ములుగులో పులి, ఫిబ్రవరిలో భూపాలపల్లిలో చిరుత బలి
- కరెంటు, ఉచ్చులతో వేట సాగిస్తున్న స్మగ్లర్లు
- అటవీగ్రామాలు, పట్టణాల్లో మాంసం విక్రయం
- మేతకు వెళ్లి బలవుతున్న సాదు జంతువులు



ఫిబ్రవరిలో భూపాలపల్లి అడవుల్లో ఉచ్చుకు బలైన చిరుతపులి

భూపాలపల్లి: అడవుల ఖిల్లాగా పేరొందిన జిల్లాలో వణ్యప్రాణుల వేట యథేచ్ఛగా సాగుతోంది. అడవుల్లో నీరున్న ప్రాంతాల్లో వేటగాళ్లు కరెంటు, ఉచ్చులు బిగించి జంతువులను వేటాడుతున్నారు. మాంసాన్ని అటవీ గ్రామాలతో పాటు పట్టణాలకు తరలించి విక్రయిస్తున్నారు. స్మగ్లర్ల వేటకు పులి, చిరుతపులి కూడా బలైన సంఘటనలు ఉన్నాయి. అయినా వేట మాత్రం ఆగడం లేదు.

నీరుండే ప్రాంతాలను ఎంచుకొని..

జిల్లా అడవుల్లో దుప్పులు, మెకంలు, జింకలు, కొండగొర్రెలు, అడవి పందులు, కుందేళ్లు వేల సంఖ్యలో ఉన్నాయి. వేసవికాలం కావడంతో అవి రాత్రి వేళల్లో దప్పిక తీర్చుకునేందుకు నీరు నిల్వ ఉండే ప్రాంతాలకు వస్తుంటాయి. దీనిని గమనించిన స్మగ్లర్లు అక్కడే ఉచ్చులు, విద్యుత్ తీగలు అమర్చి వన్యప్రాణులను చంపుతున్నారు. విద్యుత్ లైన్‌కు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో అయితే రాత్రివేళ తాత్కాలికంగా నీరున్న ప్రాంతం చుట్టూ విద్యుత్ తీగను అమర్చుతున్నారు. విద్యుత్ లైన్ లేనట్లయితే బైక్‌ల క్లచ్ వైర్లతో ఉచ్చులను ఏర్పాటు చేస్తున్నారు. తెల్లవారుజామునే వెళ్లి బలైన అటవీ జంతువును అక్కడే కోస్తున్నారు. అనంతరం మాంసాన్ని కేజీ చొప్పున పోగులుగా వేసి గుట్టుచప్పుడు కాకుండా గ్రామాలు, పట్టణాల్లో విక్రయిస్తున్నారు. అటవీశాఖ అధికారులు దాడులు నిర్వహిస్తూ స్మగ్లర్లపై కేసులు నమోదు చేస్తున్నప్పటికీ వేటగాళ్లు తమ వైఖరిని మార్చుకోవడం లేదు.

ప్రధానంగా ఈ గ్రామాల సమీపంలోనే..

జిల్లాలో ప్రధానంగా కొన్ని అటవీ గ్రామాల సమీపంలోనే అటవీ జంతువుల వేట సాగుతోంది. పలిమెల మండలంలోని పలిమెల, బోడాయిగూడెం, లెంకలగడ్డ, పంకెన, సర్వాయిపేట, కామన్‌పల్లి, మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం, అన్నారం, ఎలికేశ్వరం, బొమ్మపూర్, మద్దులపల్లి, బీరసాగర్, మహాముత్తారం మండలంలోని జీలపల్లి, యత్నారం, బోర్లగూడెం, గాజారాంపల్లి, ప్రేమ్‌నగర్, పెగడపల్లి, సింగంపల్లి, కోనంపేటతో పాటు కాటారం, భూపాలపల్లి మండలంలోని పలు గ్రామాల సమీపంలో వేట జరుగుతోంది.

బలవుతున్న పెద్ద జంతువులు..

ఉచ్చులు, విద్యుత్ తీగలకు పెద్ద జంతువులు కూడా బలవుతున్నాయి. రెండేళ్ల క్రితం ములుగు జిల్లాలో పెద్దపులి, తాజాగా ఫిబ్రవరి నెలలో భూపాలపల్లి అడవుల్లో వేటగాళ్లు అమర్చిన ఉచ్చుకు చిరుతపులి బలైంది. ఆలస్యంగా విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు చిరుతపులి కళేబరాన్ని స్వాధీనం చేసుకొని ఇద్దరు వేటగాళ్లపై కేసు నమోదు చేశారు.

సాదు జంతువులు మృత్యువాత..

వేటగాళ్ల ఉచ్చులు, కరెంట్ షాక్‌కు సాదు జంతువులు కూడా బలవుతున్నాయి. వేసవి కాలం కావడంతో మేత కోసం మేకలు, ఆవులు, గేదెలు, ఎడ్లను కాపరులు అడవిలోకి తీసుకెళ్తారు. మేత మేస్తున్న సమయంలో వేటగాళ్లు అమర్చిన ఉచ్చులు, విద్యుత్ తీగలకు సాదు జంతువులు బలవుతున్నాయి.

మచ్చుకు కొన్ని సంఘటనలు..

- పదిహేను రోజుల క్రితం పలిమెల మండలం పంకెన అడవుల్లో విద్యుత్ తీగ అమర్చగా, అటుగా వెళ్లిన ఎడ్లబండికి తీగ తగలడంతో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ఎడ్లబండి నడుపుతున్న రైతు ఈ ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు.
- ఆరునెలల క్రితం మహాముత్తారం మండలంలోని యత్నారం గ్రామంలో దుప్పి మాంసం విక్రయిస్తుండగా ముగ్గురు వేటగాళ్లను పట్టుకొని కేసు నమోదు చేశారు.
- గతేడాది నవంబర్ 2న మల్హర్ మండలంలో అడవిపందిని వేటాడి చంపి, మాంసాన్ని కారులో భూపాలపల్లికి తీసుకువస్తుండగా అటవీశాఖ అధికారులు పట్టుకొని కేసు నమోదు చేశారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి

ములుగు రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 12 వేల ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేసేందుకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ నిర్వహించి ఏడాది గడుస్తున్నా డీఎస్సీ నిర్వహించకపోవడంతో నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్సీని త్వరలో నిర్వహిస్తామంటూ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కాలం వెళ్లదీస్తున్నారని ఆరోపించారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులతో సంబంధం లేకుండా ఆర్థిక శాఖ ఆమోదం పొందిన 12 వేల పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలు, నరేష్, శివ కేశవ్, సాయి కిరణ్, రవితేజ, స్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవి

క్లుప్తంగా

75 బస్తాల పత్తి దగ్ధం



దగ్ధమైన పత్తిని పరిశీలిస్తున్న ఎస్సై నరేష్

కురవి: మానుకోట జిల్లా కురవి మండలంలోని సూదనపల్లిలో ఇంట్లో నిల్వ ఉంచిన పత్తి పంటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో 75 బస్తాల పత్తి పంట దగ్ధమైనట్లు ఆదివారం సీరోలు ఎస్సై ఎల్.నరేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నగూడూరు మండలం మంగోళిగూడెంకు చెందిన డెంకెలి యాకయ్య సూదనపల్లిలో ఓ రైతుకు చెందిన వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని పత్తి పంటను పండించాడు. అదే గ్రామానికి చెందిన నీలం సుధాకర్ ఇంటిలోని ఓ గదిని అద్దెకు తీసుకుని పండించిన పత్తి పంటను గదిలో బస్తాలో వేసి నిల్వ చేశాడు. శనివారం రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో మంటలు వ్యాపించాయి. వెంటనే ఇంటి యజమానితోపాటు చుట్టు పక్కల జనం వచ్చి మంటలను ఆర్పారు. అప్పటికే 75 బస్తాల పత్తి పంట దగ్ధమైంది. ఈ ఘటనపై యాకయ్య ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

తేనెటీగల దాడి.. 15 మందికి గాయాలు

మహదేవపూర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల కేంద్రంలో ఆదివారం జరిగిన తేనెటీగల దాడిలో 15 మంది గాయపడ్డారు. ఐబీ గెస్ట్‌హౌస్‌లో ఉన్న వేప చెట్టుకు తేనెతెట్టె పెట్టగా దానిని కోతుల గుంపు కదిలించింది. దీంతో ఆ దారి వెంట వెళ్లే 15 మందిపై తేనెటీగలు దాడి చేశాయి. బాధితులు సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లగా ప్రథమ చికిత్స చేసి రియాక్షన్ కాకుండా ఇంజక్షన్లు ఇచ్చి గ్లూకోస్ పెట్టినట్లు ఇన్‌చార్జ్ డాక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు.

సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

పరకాల: హనుమకొండ జిల్లా పరకాల మండలంలోని హైబోతుపల్లి సర్పంచ్ కంచె కుమారస్వామి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. వారం రోజుల క్రితం పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి రాకపోవడంతో మనస్తాపానికి గురైన కుమారస్వామి ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు సమాచారం. ప్రస్తుతం కుమారస్వామి పరకాల పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు.

బ్రహ్మోత్సవాలకు వేళాయె..

- నేటి నుంచి హేమాచలుడి జాతర
- వేడుకలకు ముస్తాబైన ఆలయం
- 10 రోజుల పాటు పండుగ వాతావరణం
- తెలంగాణతోపాటు, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి తరలిరానున్న భక్తులు

మంగపేట: రెండో యాదగిరిగుట్టగా ప్రసిద్ధి గాంచిన ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరులోని హేమాచల లక్ష్మీనర్సింహస్వామి క్షేత్రం బ్రహ్మోత్సవాల(జాతరకు)కు సర్వాగ సుందరంగా ముస్తాబైంది. భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయ వేదపండితులు అమరవాది మురళీకృష్ణమాచార్యుల బృందం ఈ వేడుకలను నిర్వహించనున్నారు. నేటి(సోమవారం) నుంచి పది రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు వీలుగా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. అత్యంత వైభవంగా జరిగే బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో అందుకు అవసరమైన సదుపాయలు కల్పించినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రావణం సత్యనారాయణ తెలిపారు.

అంకురార్పణతో జాతర ప్రారంభం

హేమాచల క్షేత్రంలో సోమవారం ఉదయం 6 గంటలకు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, ఆలయ కార్యనిర్వహణ అధికారి పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలు అంకురార్పణ కార్యక్రమంతో



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన హేమాచల క్షేత్రం

ప్రారంభం కానున్నాయి. 2న మంగళవారం గరుడాదివాసం, 3న ధ్వజారోహనం, 4న ఎదుర్కోలు, 5న మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్నంలో లక్ష్మీనర్సింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లతో తిరుకల్యాణ మహోత్సవం, 6న రథోత్సవం, 7న శ్రీరమా సత్యనారాయణస్వామి వారి స్నపనం, 8న దోపోత్సవం, లక్ష్మీసహస్రహోమం, 9న మహాపూర్ణాహుతి, నాకబలి(నాగవెల్లి), 10న సామూహిక సత్యనారాయణ స్వామి వారి వ్రతాలు, అన్నదాన ప్రసాద వితరణ.. వసంతోత్సవంతో జాతర ముగుస్తుందని ఆలయ ఈఓ సత్యనారాయణ వెల్లడించారు.

నాభి చందనంతో సంతాన భాగ్యం

ఆలయంలో ప్రతి శని, ఆదివారం స్వయంభువు స్వామివారికి తిల తైలాభిషేకం, దేవేరులకు పట్టు వస్త్రాలు సమర్పించి స్వామవారి నాభి నుంచి స్రవించే ద్రవాన్ని మంచి గంధంతో కలిపి(నాభి చందనం) సేవిస్తే స్వామివారి అనుగ్రహంతో సంతాన భాగ్యం కలుగుతుందని భక్తుల నమ్మిక. దీంతో ప్రతి, శని, ఆదివారం సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తుంటారు.

ప్రకృతి ప్రసాదం చింతామణి జలపాతం

ఆలయ సమీపంలో సహజసిద్ధంగా వెలిసిన చింతామణి జలపాతం ఆలయానికి వచ్చే భక్తులు ప్రకృతి ప్రసాదంగా భావిస్తుంటారు. హేమాచల



ఆలయంలో స్వయంభువుగా వెలిసిన లక్ష్మీనర్సింహస్వామి



ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

కొండపై ఔషధ గుణాలు కలిగిన వేల రకాల వృక్ష సంపద ఉండటంతో పాటు చెట్ల వేర్ల నుంచి సంవత్సరం పొడవునా అన్ని కాలాల్లో ఒకే విధంగా చింతామణి జలపాతం పారుతూ ఉండటం విశేషం. ఆలయానికి వచ్చే భక్తులు చింతామణి జలపాతం వద్ద స్నానం చేస్తుంటారు. జలపాతం నుంచి వచ్చే నీరు అతి శీతలంగా ఔషధ గుణాలు కలిగి మినరల్ వాటర్‌ను తలపించేలా రుచికరంగా ఉంటుంది. ఎన్నిరోజులు నిలువ ఉంచినా పాడై పోకుండా ఉండటంతో నీటిని రోజూ సేవిస్తే బీపీ, షుగర్ తదితర దీర్ఘ కాలిక వ్యాధులు, చర్మ రుగ్మతలు సైతం నయమవుతాయని భక్తుల నమ్మకం. దీంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడికి వచ్చి నీటిని క్యాన్లలో తీసుకుని వెళ్తుంటారు.

మాదిగలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

హన్మకొండ చౌరస్తా: సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడిన మాదిగలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈదునూరి యాకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్ నేరేళ్ల వేణుమాదవ్ కళా ప్రాంగణంలో దండోరా ఉమ్మడి జిల్లా స్థాయి విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో యాకయ్య మాట్లాడుతూ.. తెలంగాణ నూతన సచివాలయానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టి ప్రారంభించిన కేసీఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా హైదరాబాద్‌లో 10 ఎకరాల స్థలం కేటాయించి మాదిగల ఆత్మగౌరవ భవనం నిర్మించి ఇవ్వాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. పారిశుధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఢిల్లీలో నూతనంగా నిర్మించే పార్లమెంట్ భవనానికి రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ పేరుపెట్టాలని ప్రధాని మోదీని కోరారు. సమావేశంలో మెట్టుపల్లి కొమురయ్య, బొట్ల రమేష్, సమ్మయ్య, కొట్ట శ్రావణ్, సుదర్శన్, ఆంజనేయులు, పురుషోత్తం, వెంకటేశ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్

సంగెం: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలిక కిడ్నాప్‌కు గురైనట్లు ఎస్సై భరత్ తెలిపారు. పర్వతగిరి మండలానికి చెందిన ఓ యువకుడు సదరు బాలికకు మాయమాటలు చెప్పి అపహరించుకుని పోయాడని ఆ బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆవుమాంసం రవాణా ముఠా అరెస్ట్



ఆటోలో తరలిస్తున్న ఆవు మాంసం



అటవీశాఖ అధికారులకు చిక్కిన ఆవు మాంసం విక్రయిస్తున్న ముఠా

- దుప్పిమాంసం అంటూ విక్రయానికి యత్నం

ఏటూరునాగారం: ఆవును కోసి దుప్పి మాంసం అని చెప్పి విక్రయిస్తున్న ముఠాను అటవీశాఖ అధికారులు ఆదివారం తెల్లవారు జామున మండలంలోని చిన్నబోయినపల్లి వద్ద పట్టుకున్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలానికి చెందిన ఇప్రస్ వద్ద మండల కేంద్రానికి చెందిన రాకేష్, వినోద్‌లు సుమారు 80 కిలోల ఆవు మాంసాన్ని కొనుగోలు చేశారు. ఆవును కోసినప్పుడు వచ్చిన రక్తానికి ఉప్పు కలిపి ఆ మాంసానికి కల్పి దుప్పి మాంసంగా మార్చి కిలో ప్యాకెట్లుగా పార్సిల్ చేసి ఇతర గ్రామాలు, ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు. ఆవును కోయడమే నేరం అంటే అందులోనూ దుప్పి మాంసం పేరుతో ప్రజలను మోసం చేసి విక్రయించడం మరో నేరం. ఈక్రమంలో అటవీశాఖ అధికారులు పక్కా సమాచారంతో పట్టుకొని వినోద్, రాకేష్‌లపై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి ఆవు మాంసాన్ని స్వాధీనం చేసుకొని ఆటోను సీజ్ చేశారు.

ఈ విషయంపై ఇన్‌చార్జ్ ఎఫ్ఆర్ఓ నరేందర్‌ను వివరణ కోరగా ఆదివారం తెల్లవారు జామున పక్కా సమాచారంతో రాకేష్, వినోద్ అనే ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి ఆటో, మాంసాన్ని స్వాధీనం చేసుకొని రేంజ్ కార్యాలయానికి తరలించామన్నారు. చట్టపరంగా చర్యలు తప్పవని తెలిపారు. అటవీజంతువులను వేటాడడం నేరమని అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటవీజంతువుల మాంసం పేరుతో ఎవరైనా విక్రయించడానికి వస్తే తమకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

ముగిసిన 'భట్టి' పాదయాత్ర

- భీంపల్లి నుంచి మొదలై.. పెంబర్తి వద్ద వీడ్కోలు
- ఉమ్మడి వరంగల్‌లో ఏడు రోజులు.. 98 కిలోమీటర్లు..

జనగామ: రాష్ట్రంలో ప్రజాప్రభుత్వాన్ని తీసుకువచ్చేందుకు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆదివారం ముగిసింది. ఈనెల 24న హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం భీంపల్లిలో ప్రవేశించిన పాదయాత్ర.. జనగామ జిల్లా పెంబర్తి శివారు కాకతీయ కళాతోరణం వద్ద.. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం గుండ్లగూడెంలోకి ప్రవేశించింది. ఏడు రోజుల పాటు కొనసాగిన పాదయాత్ర హనుమకొండ, జనగామ జిల్లాలో 98 కిలోమీటర్లు పూర్తి చేసుకుంది. గతనెల 16న ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం, పిప్పిరి గ్రామం నుంచి మొదలైన పాదయాత్ర జనగామ జిల్లా నర్మెట్టకు చేరుకునే నాటికి 500 కిలోమీటర్ల మైలు రాయిని పూర్తి చేసుకోవడం విశేషం. ఈ సందర్భంగా పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి భట్టి విక్రమార్కను అభినందించారు. వర్ధన్నపేట, వరంగల్ వెస్ట్, స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ నియోజకవర్గాల



జనగామ: జాతీయ రహదారిపై పాదయాత్రలో భట్టి విక్రమార్క

పరిధిలో కొనసాగిన పాదయాత్రలో భట్టి ప్రజలను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. జనగామ జిల్లాలో వడగళ్లతో నష్టపోయిన వరి, మొక్కజొన్న పంటలతోపాటు కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం పరిశీలించిన ఆయన.. రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను భట్టి విక్రమార్కతో ఏకరువు పెటుక్కుని పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

పెంబర్తిలో వీడ్కోలు

జనగామ నుంచి కురుమవాడ.. వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారి మీదుగా పెంబర్తికి చేరుకున్న భట్టికి అపూర్వ స్వాగతం లభించింది. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి.. వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆలేరు నియోజకవర్గంలో ప్రవేశించగా.. పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు ధర్మసంతోష్‌రెడ్డి, చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, లింగాజీ, ధర్మపురి శ్రీనివాస్, మాజీద్, గిరికొండల్‌రెడ్డి, పిన్నింటి నారాయణరెడ్డి, జక్కుల వేణుమాధవ్, మహేందర్ రెడ్డి, మహాత్మాచారి, కట్ట కృష్ణ ఉన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



భద్రు(ఫైల్)

చెన్నారావుపేట: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని ధర్మతండా శివారు హట్య తండాలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇదే తండాకు చెందిన బాధావత్ భద్రు(35) మూడు సంవత్సరాల క్రితం అప్పుతెచ్చి ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. ట్రాక్టర్ కిస్తీలు, తెచ్చిన అప్పులకు వడ్డీలు ఎక్కువయ్యాయి. ట్రాక్టర్ పనులు లేక నిరుపయోగంగా ఉంటుంది. దీంతో ట్రాక్టర్ ఇంటి వద్దనే ఉంచి హనుమకొండలో కూలీ పనులకు వెళ్లాడు. హైదరాబాద్‌లో కారు డ్రైవింగ్ చేస్తానని భార్యకు చెప్పి మే 22న వెళ్లాడు. ఈక్రమంలో ఆదివారం ఎల్లాయగూడెం శివారులోని గుట్టల సమీపంలో ఓ మృతదేహం ఉన్నట్లు అటుగా వెళ్లిన వారు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటన స్థలానికి వెళ్లిన ఎస్సై తోట మహేందర్ మృతదేహాన్ని పరిశీలించి, పక్కనే ఉన్న క్రిమి సంహారక మందు రశీదు ఆధారంగా హట్య తండాకు చెందిన భద్రుగా గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భద్రుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించారు. భద్రు భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రాణం తీసిన ధాన్యం కుప్పలు

- ధాన్యానికి అడ్డుపెట్టిన రాళ్లకు తగిలి కిందపడినపోయిన వ్యక్తి
- వెనకనే వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టడంతో మృతి



సుబ్బన్న మృతదేహం

వరంగల్(పర్వతగిరి): రోడ్డుపై రైతులు ఆరబోసిన ధాన్యం కుప్పలకు అడ్డుగా పెట్టిన రాళ్లు తగలడంతో కిందపడిన ద్విచక్రవాహనదారుడిని వెనకనే వచ్చిన ట్రాక్టర్ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామ శివారులో ఆదివారం రాత్రి జరిగిన ఘటనకు సంబంధించి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చెరువుకొమ్ముతండాకు చెందిన సుబ్బన్న(33) అదే తండా జీపీలో మల్టీపర్పస్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం మండలంలోని అన్నారం షరీఫ్‌లో చెరువుకొమ్ముతండా పంచాయతీ కార్యదర్శి కుడికాల రమాదేవి ఇంట్లో జరిగిన శుభకార్యానికి హాజరై ఇంటికి వస్తుండగా పర్వతగిరి నుంచి అన్నారం షరీఫ్ వైపు వెళ్తున్న ట్రాక్టర్ ఢీ కొనడంతో సుబ్బన్న అక్కడికక్కడే మృతి చెందాడు. సుబ్బన్నకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. సుబ్బన్న కుటుంబం పేదరికంలో ఉండడంతో కూతుళ్ల జీవనం అగమ్యగోచరంగా మారింది. సుబ్బన్న మృతితో తండావాసులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మృతదేహం వద్ద రోధించిన కంటతడిపెట్టింది. అయితే సుబ్బన్న మృతికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌ను కఠినంగా శిక్షించి, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

ట్రాలీ ఆటో ఢీకొని వ్యక్తి మృతి



పెంటయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలంలోని ఛాగల్లు గ్రామంలో ఆదివారం జాతీయ రహదారి దాటుతున్న జాపరకొండ పెంటయ్య(50)ను గూడ్స్ ట్రాలీ ఆటో ఢీకొట్టడంతో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పెంటయ్య వ్యక్తిగత పనుల నిమిత్తం రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న గూడ్స్ ట్రాలీ ఆటో ఢీకొట్టగా తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కాగా, పెంటయ్య కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు రేగొండ మండలం రూపురెడ్డిపల్లికి చెందిన ట్రాలీ ఆటో డ్రైవర్ ఎండీ.అంకూష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాఘవేందర్ తెలిపారు.

సచివాలయంలో మన మంత్రులకు చాంబర్లు






హైదరాబాద్‌లో నూతనంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. కాగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్ తమకు కేటాయించిన చాంబర్‌లలో ఆశీనులయ్యారు. పలు ఫైళ్లపై సంతకం చేశారు. ఈ సందర్భంగా మంత్రులకు ఆయా జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

పిడుగుపాటుతో సెల్‌ఫోన్‌కు షార్ట్ సర్క్యూట్

- యువకుడికి తీవ్ర గాయాలు

లింగాలఘణపురం: జనగామ జిల్లా లింగాలఘనపురం మండలంలోని సిరిపురంలో పిడుగు పాటుతో ఆదివారం సెల్‌ఫోన్‌కు షార్ట్ సర్క్యూట్‌తో సెల్‌ఫోన్ పేలి అదే గ్రామానికి చెందిన చీటకోరు మహేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. చీటకోరు మహేష్ ఆదివారం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పాడిగేదెలను మేపుతున్న క్రమంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం రావడంతో గేదెలను దొడ్లోకి తోలుకెళ్తున్న క్రమంలో పిడుగు పడి జేబులో ఉన్న సెల్‌ఫోన్ పేలింది. దీంతో మహేష్‌కు కుడి తొడ భాగంలో తీవ్ర గాయాలై స్పృహ కోల్పోవడంతో సమీపంలోని రైతులు గమనించి ఆస్పత్రికి తరలించారు.

చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతి



మల్లయ్య(ఫైల్)

కాటారం: చెరువులో చేపల వేటకి వెళ్లిన వ్యక్తి గల్లంతై మృతి చెందిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడలో ఆదివారం చోటు చేసుకొంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుండ్ల మల్లయ్య(63) ఉదయం చేపల వేట కోసం స్థానిక చెరువులోకి వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చెరువులో గాలింపు చర్యలు చేపట్టగా.. మల్లయ్య మృతదేహం లభ్యమైంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మల్లయ్య మృతదేహాన్ని మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మల్లయ్యకు భార్య చిన్నక్క ఉంది.

కొంపముంచిన కట్టెల వ్యాన్..

- వెనకనుంచి ఢీకొని వ్యక్తి దుర్మరణం



సమ్మయ్య మృతదేహం

దేవరుప్పుల : ఓ కట్టెల లోడుతో వెళ్తున్న వ్యాన్ మరమ్మతులు గురైంది. వ్యాన్ యజమాని హెచ్చరిక ఏర్పాటు చేయకపోవడంతో రహదారి వెంట వెళ్లే ఓ వ్యక్తి ఆగిఉన్న ఆ వ్యాన్‌ను ప్రమాదవశాత్తు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ఆదివారం రాత్రి జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడెం పరిధిలో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి ఎస్సై మునావత్ రమేష్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సీర్మాలకు చెందిన ఉందాటి సమ్మయ్య (32) జీతం(పాలేరుగా) ఉండి జీవిస్తున్నాడు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం జానకిపురంలో ఓ కార్యక్రమానికి వెళ్లి తిరిగి ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో సూర్యాపేట–జనగామ రహదారిలో కామారెడ్డి గూడెం పరిధి ఎంఎస్ఆర్ గార్డెన్ ఎదురుగా కట్టెల లోడుతో ఉన్న వ్యాన్‌కు మరమ్మతులు రావడంతో అక్కడే నిలిపి డ్రైవర్ వెళ్లిపోయాడు. చీకటి కావడంతో గమనించని సమ్మయ్య కట్టెల లోడు వ్యాన్ వెనకాల ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై అక్కడకు చేరుకుని మృతదేహాన్ని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమ్మయ్యకు భార్య, ఐదేళ్ల కుమారుడు ఉన్నాడు.